సాక్షి
జోగులాంబ గద్వాల

ఆదివారం । 1 । జూన్ । 2025



జూరాల గేట్ల మూసివేత

జూరాల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో మరింతగా తగ్గడంతో క్రస్టుగేట్లు మూసివేశారు.

వివరాలు 8లో ▸



కృష్ణజింకల సంరక్షణేది?

కృష్ణానది తీర ప్రాంతాల్లోని కృష్ణ జింకల సంరక్షణకు చర్యలు చేపట్టడం లేదు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.5 /24.1

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోత పెడుతుంది.

న్యూస్‌రీల్

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నందు ఎస్సీ కులానికి చెందిన విద్యార్థిని, విద్యార్థుల నుంచి 1వ తరగతి 5వ తరగతి వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి సరోజ ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు కుల, ఆదాయం రెసిడెన్స్ ధ్రువపత్రాలు పుట్టిన తేదీ 01.06.2019–31.05.2020 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు మరియు బోనోఫైడ్ ధ్రువపత్రాలు సమర్పించాలని, విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారికి ఏడాదికి రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షలు ఉండాలని తెలిపారు. ధ్రువపత్రాలను దరఖాస్తుకు జతపర్చి ఫారం నుంచి మే31వ తేదీ నుంచి జూన్16వ తేదీ వరకు డీఎస్‌సీడీవో కార్యాలయంలో సమర్పించాలని, పూర్తి వివరాలకు ఎస్సీ సంక్షేమశాఖ అధికారిని సంప్రదించాలని తెలిపారు.

విదేశీ విద్యా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం కింద 2025 విద్యా సంవత్సరానికి గాను విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించే మైనారిటీ విద్యార్థులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రమేష్ బాబు ప్రకటనలో తెలిపారు. అర్హత గల మైనారిటీ విద్యార్థులు(ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు మరియు పార్శిలు) పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయుటకు డిగ్రీ(ఇంజినీరింగ్)లో 60శాతం మార్కులు వచ్చి డాక్టరేట్(పీహెచ్‌డీ) చేయాలనే విద్యార్థులు ఎంపిక చేయబడిన విదేశీ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.telanganaepass.cgg.gov.in నందు జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సాయంత్రం 5గంటలకు లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను జూలై 31వ తేదీ లోపు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని, పూర్తి వివరాలకు 8099059007 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

3 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

కందనూలు: పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు కొనసాగుతాయని జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతాయని, మొత్తం 332 మంది విద్యార్థులు హాజరు కానుండగా.. అందులో 212 మంది బాలురు, 120 మంది బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాకేంద్రంలో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, హాల్‌టిక్కెట్లను ఇప్పటికే విడుదల చేశామని, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి తీసుకొని సకాలంలో కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. 5 నిమిషాల వరకు అనుమతిస్తారని.. తర్వాత అనుమతి ఉండదని తెలిపారు.

నేడు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి పురుషులు, మహిళా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్‌బిన్ అహ్మద్, నసరుల్లా హైదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 4, 5 తేదీల్లో మహబూబ్‌నగర్ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంలో జరగనున్న మొదటి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని చెప్పారు.

పద్మ అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ క్రీడలు: కేంద్ర ప్రభుత్వం హోం వ్యవహారాల శాఖ వివిధ రంగాల్లో కృషి చేసిన యువకులు/ వ్యక్తుల నుంచి పద్మ పురస్కారాల కోసం దరఖాస్తు నామినేషన్‌లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి (ఎఫ్ఏసీ) మధుసూదన్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్, సోషల్ వర్క్, పబ్లిక్ అఫైయర్స్, సైన్స్, ఇంజనీరింగ్, ట్రేడ్, ఇండస్ట్రీ, లిటరేచర్, ఎడ్యుకేషన్, స్పోర్ట్స్, మెడిసిన్, సివిల్ సర్వీసెస్ రంగాల్లో సాధించిన లక్ష్యాలు, చేసిన కృషిని రెండు పేజీలకు లేదా 800 పదాలకు మించకుండా పేర్కొంటూ నిర్ణీత ఫార్మాట్‌లో http://padmaawardr.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాలో ప్రతి ఇంటా ఆవులు, గేదెల పెంపకం

- పాడి పరిశ్రమపై ఆధారపడి వేలాది మంది జీవనం
- ప్రతిరోజు లక్షలాది లీటర్ల పాల ఉత్పత్తి
- పాల వ్యాపారంతో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న గ్రామీణులు

సార్థకనామం.. పాలమూరు



ఒకానొక సందర్భంలో వలసలకు మారుపేరైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పాలమూరు అని కూడా పిలుస్తారు. పాలు, పెరుగు సమృద్ధిగా లభించేవని, చుట్టూర ఉన్న అడవుల్లో పాలుగారే చెట్లు అధికంగా ఉండేవని.. అందుకే ఈ ప్రాంతాన్ని పాలమూరు అనే వారని చరిత్రకారులు చెబుతున్నారు. ఊరులోని పేరును సార్థకం చేసుకుంటూ పాల ఉత్పత్తిలో తరిస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది మంది పాడిని ప్రధాన జీవనాధారంగా మార్చుకున్నారు. పల్లె ప్రాంతాల్లో ప్రతి ఇంటా గేదెలు, ఆవులు పెంచుకొని పాలు అమ్ముకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ఆదివారం ప్రపంచ పాల దినోత్సవాన్ని పురస్కరించుకొని 'సాక్షి' ప్రత్యేక కథనం..

- మహబూబ్‌నగర్ వ్యవసాయం/ స్టేషన్ మహబూబ్‌నగర్/ నాగర్‌కర్నూల్/ వనపర్తి/ నారాయణపేట/ గద్వాల

నేడు ప్రపంచ పాల దినోత్సవం

సండే స్పెషల్

పాల ఉత్పత్తికి పెట్టింది పేరు పాలమూరు. జిల్లాలో పాడి పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతుంది. ప్రతినిత్యం వేలాది మంది రైతులు పాలు అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. జిల్లాలో సుమారు 10 వేల మంది పాడి రైతులు ఉన్నారు. కాగా.. విజయ డెయిరీ మిల్క్ చిల్లింగ్ సెంటర్లు 224 ఉండగా, ప్రతిరోజు 36,157.5 లీటర్ల పాలు సేకరిస్తున్నామని డెయిరీ డెవలప్‌మెంట్ అధికారులు తెలిపారు. ఈ డెయిరీ పరిధిలో మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో పాల సేకరణ జరుగుతుంది. డెయిరీతోపాటు మిల్క్ చిల్లింగ్ సెంటర్లు, బల్క్ కూలింగ్ యూనిట్లు మొత్తం 6 ఉన్నాయి. పాడి రైతుల కోరిక మేరకు ప్రైవేట్ డెయిరీల కంటే అధిక పాల సేకరణ ధర లీటరు గేదె పాలకు అధికంగా 10 శాతం వెన్న, 9 శాతం గణ పదార్థాలకు రూ.84.50, ఆవు పాలకు 4.9 వెన్న శాతానికి 8.9 ఘన పదార్థాలకు రూ.42.57 చెల్లిస్తున్నారు.

యువత సైతం మక్కువ..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యధిక మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే వ్యవసాయంతోపాటు, కరువు కాటకాలు వచ్చినప్పుడు కుటుంబ పోషణ భారం కాకుండా ఇక్కడి రైతులు పాడిపై దృష్టిసారిస్తూ వచ్చారు. ఆవులు, గేదెల ద్వారా వచ్చిన పాలను విక్రయిస్తూ జీవనం సాగించడంతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. గడిచిన ఐదేళ్ల నుంచి చాలామంది నిరుద్యోగ యువత పాడిపై మక్కువ పెంచుకున్నారు. డెయిరీ ఫాంల ఏర్పాటుతో స్వయం ఉపాధి కల్పించుకొని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

పాడి రైతులపై ఆర్థిక భారం

ఒకప్పుడు రాష్ట్రానికి రోజువారీగా అవసరమైన పాలు ఒక్క ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే ఉత్పత్తి అయ్యేవి అనడం ఏమాత్రం అతిశయోక్తి కాదేమో. అయితే ప్రస్తుతం పాడి పరిశ్రమ ఒడుదొడుకులను ఎదుర్కొంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా మూడుసార్లు ఆవు పాల ధర తగ్గించింది. ఇప్పటికే పాడి రైతులు పశుపోషణ భారమై తమ ఆవులు, గేదెలను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పరంగా విజయ డెయిరీ ద్వారా ఇస్తున్న దాణా, మినరల్ మిక్చర్స్, క్యాల్షియం మందులు సబ్సిడీలు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో రైతులు ఆర్థిక భారం మోయాల్సి వస్తుంది. కాల్షియం మందులు, విజయ దాణా కొనుగోలు చేయాలంటే సబ్సిడీ కాకుండా పూర్తి ధర చెల్లించాల్సి వస్తుందని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పాడి రైతుల సంక్షేమం కోసం డెయిరీ పరంగా అనేక ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అవి రైతులకు భరోసా కల్పించడం లేదు. ఉచిత పశువైద్య శిబిరాల నిర్వహణ, పాడి రైతులకు డీబీటీ సదుపాయంతోపాటు ప్రతి 15 రోజులకు ఒకసారి పాల బిల్లులు సక్రమంగా అందడం లేదు. దీంతో రైతులు ప్రైవేటు సెంటర్లలో విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

1975లోనే పాలకేంద్రం

గద్వాల ప్రాంతంలో 1975లో ప్రభుత్వం పాల కేంద్రం స్థాపించింది. చాలా ఏళ్లపాటు రైతులు ఇక్కడ పాలు విక్రయించారు. ఆ తర్వాత ప్రభుత్వాలు, అధికారుల నిర్లక్ష్యం మూలంగా పాల కేంద్రం మూతబడింది. కాగా 2020 ప్రాంతంలో విజయ డెయిరీ ఆధ్వర్యంలో 5 వేల లీటర్ల సామర్థ్యంతో పాలకేంద్రం పునఃప్రారంభమైంది. దీని ద్వారా జిల్లావ్యాప్తంగా 25 పాలసేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి.. ప్రతిరోజు 2,500 లీటర్ల పాలు సేకరిస్తున్నారు. ఇవి కాకుండా ప్రైవేట్ పరంగా మరో పది దాక పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి.



గద్వాలలోని ఓ డెయిరీ ఫాంలో పాలు పితుకుతున్న రైతు



మహబూబ్‌నగర్‌లోని పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య భవనం

నాగర్‌కర్నూల్‌లో 9 కేంద్రాలు..

నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రస్తుతం 9 కేంద్రాలు మాత్రమే అందుబాటులో ఉండగా జిల్లావ్యాప్తంగా 220 అవుట్ లెట్ల ద్వారా పాలు సేకరిస్తున్నారు. అయితే ప్రతిరోజు 1.70 లక్షల లీటర్లకు పైగా పాల ఉత్పత్తి జరుగుతున్నా కేంద్రాల ద్వారా దాదాపు 10 వేల మంది రైతుల నుంచి 74వేల లీటర్ల పాలు మాత్రమే సేకరిస్తున్నారు.

వనపర్తిలో ప్రైవేట్ వైపే..

జిల్లాలో ప్రతిరోజు 53,677 లీటర్ల పాల ఉత్పత్తి అవుతోంది. అయితే పాడిరైతులు రోజువారిగా ఉత్పత్తి చేసిన పాలను 95 శాతం గృహ అవసరాలు, ప్రైవేటు డెయిరీలకు వెళ్తుంటే.. కేవలం 5 శాతం మాత్రమే ప్రభుత్వం అనుబంధంగా నిర్వహిస్తున్న విజయ డెయిరీకి పోస్తున్నారు. విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతుల సంఖ్య కేవలం 343 మంది మాత్రమే ఉండటం గమనార్హం.

నారాయణపేట జిల్లాలో..

జిల్లాలో 280 గ్రామాలతోపాటు పెద్దఎత్తున తండాలు ఉండటం వల్ల గ్రామీణ జనాభా ఎక్కువగా ఉండటంతో పాడి పశువుల పోషణే ప్రధాన జీవనోపాధిగా మారింది. జిల్లావ్యాప్తంగా 500 మిల్క్ సెంటర్లు ఉండగా ప్రైవేటు వారు 30 వేల లీటర్లు, విజయ డెయిరీ నుంచి 2,500 లీటర్ల పాలను సేకరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో పాడి పశువులు, పాల ఉత్పత్తి ఇలా..

జిల్లా	గేదెలు	ఆవులు	ప్రతిరోజు పాల ఉత్పత్తి
మహబూబ్‌నగర్	50,000	80,000	36,157
నాగర్‌కర్నూల్	1,20,800	80,500	1,70,225
వనపర్తి	22,955	9,774	35,677
జోగులాంబ గద్వాల	49,659	47,902	40,000
నారాయణపేట	24,000	35,000	27,300



కల్వకుర్తిలో పాలు సేకరిస్తున్న విజయ డెయిరీ సిబ్బంది

ఆర్థికంగా పర్వాలేదు..



నేను పీజీ (ఎమ్మెస్సీ, జువాలజీ) పూర్తి చేశాను. నిరుద్యోగిగా ఉన్న నేను కరోనా లాక్‌డౌన్ సమయంలో సొంత స్థలంలో రూ.25 లక్షలతో డెయిరీఫాం ఏర్పాటు చేశాను. ప్రతిరోజు 100 నుంచి 120 లీటర్ల పాలు డెయిరీ ఫాం నుంచి సేకరిస్తాం. పాడి ద్వారా ఆర్థికంగా పర్వాలేదు. డెయిరీ ఫాంలు నెలకొల్పేలా యువతను మరింతగా ప్రభుత్వం ప్రోత్సహించాలి. బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలి. – గరిడి రఘు, పాడి రైతు, గద్వాల

రైతుసేవలో విజయ డెయిరీ



విజయ డెయిరీ రైతు సేవలో ఎల్లప్పుడు ముందుంటుంది. నిరంతరం కొత్త టెక్నాలజీని ప్రవేశపెడుతూ ప్రైవేట్ డెయిరీలకు ధీటుగా పాడి రైతుల సంక్షేమానికి పాటుపడుతుంది. తమ డెయిరీ పరిధిలో ఎంసీసీ, బీఎంసీయూ ఉన్నాయి. మొత్తం 224 మిల్క్ చిల్లింగ్ సెంటర్ల ద్వారా పాల సేకరణ జరుగుతుంది.

– శ్రీనివాసులు, డిప్యూటీ డైరెక్టర్, విజయ డెయిరీ, మహబూబ్‌నగర్

రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ

గద్వాల: జూన్ 2వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఐడీవోసీ కార్యాలయంలోని తనఛాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని ఐడీవోసీ కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో ఉదయం 10గంటలకు నిర్వహించే వేడుకలలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేడుకలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా అట్టహాసంగా నిర్వహించాలని, అన్ని సంక్షేమాభివృద్ధి శాఖలకు చెందిన కార్యక్రమాలు ప్రతిబింబించేలా ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా గద్వాల పట్టణంలోని స్మృతివనం, పాతబస్టాండ్ వద్ద గల తెలంగాణ పోరాయోధుల విగ్రహాల వద్ద సభాస్థలి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరేడ్‌గ్రౌండ్‌లో పోలీసుగౌరవ వందనం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, ఏవో భూపాల్‌రెడ్డి, డీఎస్పీ మొగులయ్య, తహసీల్దార్, మున్సిపల్ కమీషనర్ వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, సంఘం నాయకులు

గద్వాల: సీడు పత్తి రైతులపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని, రైతు పండించిన సీడుపత్తి ధరను పెంచి ఫెయిలైన విత్తనాలను రీశాంపిల్‌కు పెట్టాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు గొంగళ రంజిత్‌కుమార్, బుచ్చిబాబు డిమాండ్ చేశారు. శనివారం సీడుపత్తి రైతులతో ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీడుపత్తి రైతులను ఆర్గనైజర్లు, సీడుపత్తి కంపెనీలు మోసం చేస్తున్నాయన్నారు. కంపెనీల నుంచి వచ్చే ప్రయోజనాలను దళారులుగా ఉన్న ఆర్గనైజర్లే దోచేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు పంటలు సాగుచేసేముందు అడ్వాన్స్ రూపంలో ఇచ్చే పెట్టుబడిని బాకీల కింద లెక్కకట్టి వాటికి వడ్డీలు వేసి పంటలు వచ్చిన తరువాత రైతుల వద్ద నుంచి ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. రైతులు పండించిన సీడుపత్తి విత్తన పాకెట్ ధరలను పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆర్గనైజర్లు చేస్తున్న దోపిడీకి అడ్డుకట్ట వేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రంగస్వామి, వెంకట్రాములు, జమ్మన్న, శ్రీనివాస్, బలరాం, గోవిందు, విష్ణు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్ల పంచమిని పురస్కరించుకొని శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, కుంకుమార్చనలు, మహానైవేద్య నీరాజనాలు, విశేష అలంకరణ వంటి పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో సరస్వతి దేవిని దర్శించుకొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు.. చిన్నారులకు సామూహికంగా అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని వేద మంత్రాల నడుమ వైభవంగా చేయించారు. వివిధ ప్రాంతాల నుండి హాజరైన భక్తులకు పాలక మండలి ఆధ్వర్యంలో అల్పాహారం, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సురేందర్‌రాజు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

4న ఇంటర్వ్యూలు

నాగర్‌కర్నూల్ క్రైం: నేషనల్ హెల్త్‌మిషన్ ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను బస్తీ దవాఖానాల్లో ఒప్పంద పద్ధతిన వైద్యాధికారుల నియామకానికి ఈనెల 4న వాక్–ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డా. స్వరాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి: కేఎల్ఐ కాల్వలో చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నలబొగుడ గ్రామానికి చెందిన పుట్టపాగ శివకుమార్(35) భార్య, కుమారుడితో కలిసి కూలి పనులు చేస్తూ జీవించేవారు. శుక్రవారం సాయంత్రం కేఎల్ఐ కాల్వలోకి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. శనివారం పెద్దకొత్తపల్లి పోలీసులు జాలర్లను పిలిపించి కేఎల్ఐ కాల్వలో గాలింపు చేపట్టగా శివకుమార్ మృతదేహం లభించింది. అతని తల్లి బురానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భూ తగాదాలో భార్యాభర్తలపై దాడి


గాయపడిన గోపాల్‌రెడ్డి

తాడూర్: భూ తగాదాలో భార్యాభర్తలపై దాడికి పాల్పడిన సంఘటన తాడూరు మండలంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ గురుస్వామి కథనం మేరకు.. మండలంలోని ఐతోలు గ్రామానికి చెందిన దాయదులు గోపాల్‌రెడ్డి, క్రిష్టారెడ్డి మధ్య ఎన్నో ఏళ్లుగా భూ సంబంధ తగాదాలున్నాయి. ప్రతి ఏటా పొలాలు దున్నే సమయంలో ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. శనివారం గోపాల్‌రెడ్డి, తిరుపతమ్మ దంపతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. అదే గ్రామానికి చెందిన దాయాది క్రిష్టారెడ్డి పొలం వద్ద గోపాల్‌రెడ్డి, తిరుపతమ్మలపై గొడ్డలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన దంపతులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. గోపాల్‌రెడ్డి కూతురు అనూష ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


ఉంద్యాల శివారెడ్డి(ఫైల్)

మరికల్: కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గత నెల 15న మరికల్‌లోని పెట్రోల్ బంకు సమీపంలో ఓ కారు రెండు బైక్‌లను ఢీకొట్టింది. ప్రమాదంలో మరికల్‌కు చెందిన రంగలి శ్రీకాంత్ (22) అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన చిన్న చింతకుంట మండలం ఉంద్యాలకు చెందిన శివారెడ్డిని (42) హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఇతను చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం


వెంకట్‌రెడ్డి (ఫైల్)

హన్వాడ: అతివేగంతో వచ్చిన ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మరణించిన ఘటన శనివారం సాయంత్రం ఇబ్రహీంబాద్ శివారులోని ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన మునిమోక్షం వెంకట్‌రెడ్డి సొంత పనుల నిమిత్తం బైక్‌పై హన్వాడకు బయలుదేరాడు. ఈ క్రమంలో వెనకాల నుంచి వస్తున్న కారు, బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట్‌రెడ్డికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించాడు. కారు నడిపిన వ్యక్తి కోస్గికి చెందిన బలిజ రవిగా గుర్తించారు. మద్యం మత్తులో కారు నడపడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. వెంకట్‌రెడ్డి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

వేడినీళ్లు పడి బాలుడికి గాయాలు..

- చికిత్స పొందుతూ మృతి


చిన్ను (ఫైల్)

నవాబుపేట: స్నానం కోసం వేడి చేసిన నీరు ఒంటిపై పడి తీవ్రంగా గాయపడిన ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని తీగలపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ సోదరుడి కుమారుడు చిన్ను (10 నెలలు) గత నెల 15న ఇంట్లో స్నానానికి పెట్టిన వేడి నీటి బకెట్‌ను పైన వేసుకోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు బాలుడిని చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. దీంతో ఈ ఘటనపై బాలుడి పెదనాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

కృష్ణ జింకల సంరక్షణేది?



- గతంలో రూ.2.70 కోట్లు కేటాయించి రద్దు చేసిన ప్రభుత్వం
- తాజాగా అటవీశాఖ ఆధ్వర్యంలో 'హరిత నిధి'లో ప్రతిపాదనలు
- పంటల ధ్వంసంతో ఆందోళనలో రైతులు


పొలాల్లో జింకల గుంపులు

కృష్ణా: మండలంలో కృష్ణానది తీర ప్రాంతాల్లోని కృష్ణ జింకల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జింకల కారణంగా ప్రతి ఏడాది వందల ఎకరాల్లో పంటలు నాశనం అవుతున్నాయి. రైతుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది రూ.2.70 కోట్లు మంజూరు చేసింది. కానీ ఆ నిధులను జింకల పరిరక్షణకు వాడుకోవడం కుదరదని భావించిన ప్రభుత్వం మళ్లీ రద్దు చేసింది. ఈ ఏడాది 'హరిత నిధి' కింద మరోమారు రూ.2.70 కోట్లతో కృష్ణ జింకల పరిరక్షణకు అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఆ నిధులు ప్రభుత్వం ఇంకా విడుదల చేయలేదని, నిధులు విడుదలైతే పనులు ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు.

రైతులకు తప్పని కష్టాలు

మక్తల్ నియోజకవర్గంలోని వేలాది కృష్ణజింకలు పొలాల్లోకి ప్రవేశించి సాగు చేసిన పంటలను తినేస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ముందస్తు వర్షాలు రావడంతో అన్ని గ్రామాల్లో పత్తి విత్తనాలు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో జింకల మూలంగా రైతులకు ఇబ్బందులు తప్పేటట్లు లేవు. విత్తనాలు మొలకెత్తిన నాటి నుంచి పంటపై జింకలు దాడి చేస్తుండడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడుతుందోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి మొత్తం పంటను నాశనం చేస్తుండడంతో పెట్టుబడులు రాకపోగా చేసినా శ్రమ వృథా అవుతోందని అన్నదాతలు వాపోతున్నారు. ఈ ప్రాంత రైతులను వేధిస్తున్న కృష్ణ జింకల సమస్యను పరిష్కరించాలని కొంతకాలంగా కృష్ణా, మాగనూర్, మక్తల్, ఊట్కూర్ మండలాలకు చెందిన రైతులు పలుమార్లు ఆందోళనలు చేశారు. దీంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులకు సైతం పలుమార్లు విన్నవించడంతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతుల ఇబ్బందులను తొలగించుటకు గతేడాది నిధులు కేటాయించింది. ఈ మండలాల్లో ఉన్న వేలాది కృష్ణ జింకలను ఒకేసారి పట్టుకోవడం సాధ్యం కాకపోవచ్చు కానీ రానున్న రోజుల్లో వీటిని ప్రభుత్వం ఏర్పాటు చేసే సంరక్షణ కేంద్రానికి తరలించే అవకాశం ఉండడంతో రైతులకు పూర్తిగా మేలు జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా నిధులు విడుదల చేసి తమ కష్టాలను తొలగించాలని ఉమ్మడి మండలాల్లోని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


ముడుమాల్ శివారులో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

74 ఎకరాల్లో జింకల సంరక్షణ

మండలంలోని ముడుమాల్ గ్రామ సమీపంలో గల ప్రభుత్వ భూమి 192, 194 సర్వే నంబర్‌లో గల 74.12 ఎకరాల్లో కృష్ణ జింకల సంరక్షణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అందుకు గాను రెవెన్యూ అధికారులు డిసెంబర్ 2, 2022లోనే కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అటవీ శాఖ అధికారులకు భూమిని అప్పగించారు. ప్రస్తుతం ఆ భూమిలో జింకలను పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

నిధుల విడుదల కావాల్సి ఉంది

కృష్ణ జింకల పరిరక్షణకు 'హరిత నిధి' కింద అటవీ శాఖ పంపించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.2.70కోట్లు మంజూరు చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే ముడుమాల్ గ్రామ శివారులో అటవీశాఖకు కేటాయించిన భూమిలో పనులు చేపడుతాం.

– అరవింద్ ప్రసాద్‌రెడ్డి, అటవీశాఖ జిల్లా అధికారి, నారాయణపేట

లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుతో విద్యాభివృద్ధి


పీయూ వీసీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీసీటీఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ప్రభుత్వం లా, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడం ఉమ్మడి జిల్లాలో విద్యాభివృద్ధి జరుగుతుందని, వాటి ఏర్పాటుకు కృషి చేసిన వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్‌ను బీసీటీఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో మొదటి సారి లా, ఇంజినీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మంది పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని, ఉమ్మడి జిల్లాలో విద్యాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కొత్త కళాశాలలో విద్యార్థులు ఉపాధి కల్పించే విధంగా కోర్సులను ఏర్పాటు చేసే వారు త్వరిత గతిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాములు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలవిద్యుత్ కేంద్రం సందర్శన


భూగర్భ కేంద్రాన్ని సందర్శించిన ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

దోమలపెంట: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఆయనకు కేంద్రం చీఫ్ ఇంజినీర్ రామసుబ్బారెడ్డి స్వాగతం పలికి, విద్యుదుత్పత్తి తీరు, ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను లోడ్ డిస్పాచ్‌కు సరఫరా చేసే విధానం గురించి వివరించారు. మెయిన్ కంట్రోల్ రూంలో ఇంజినీర్లు విధులు నిర్వహించే పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం క్రిష్ణా బేసిన్‌లో వరద కొనసాగుతున్నందున ఈ ఏడాది కూడా భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం నిర్వహణ తీరు బాగుందని, అధికారులు అహర్నిశలు కష్టపడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'


మాట్లాడుతున్న డా.దాసరి అజయ్‌కుమార్

బిజినేపల్లి: జనాభా నిష్పత్తి ప్రకారం దేశం, రాష్ట్రంలో బీసీలకు దక్కాల్సిన నిధులు, రిజర్వేషన్లు అందడం లేదని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డా.దాసరి అజయ్‌కుమార్ అన్నారు. శనివారం బిజినేపల్లి మండల కేంద్రంలో బీసీ సంఘాల నాయకులు ఒక రోజు రీలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు, రాష్ట్ర ప్రభుత్వం బీసీల కోసం ప్రత్యేకంగా సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సబ్ ప్లాన్ ద్వారా ప్రతి సంవత్సరం బీసీలకు రూ.20 వెల కోట్లు నిధులు కేటాయించి, కుల వృత్తుల వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకంలో బీసీలకు 56శాతం అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ను పెంచాలన్నారు. కార్యక్రమంలో పూలే ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పచ్చిపాల సుబ్బయ్య, నాయకులు చింతకుంట శ్రీనివాస్‌యాదవ్, నారమోని నరేష్‌యాదవ్, వెంకటస్వామి, భాస్కర్, సత్యశీలాసాగర్, ఈర్ల చంద్రమోళి, శ్రీనివాస్‌గౌడు, సంజీవ్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

జూరాల క్రస్టుగేట్ల మూసివేత


మూసివేసిన జూరాల క్రస్టు గేట్లు

ధరూరు/ రాజోళి/ దోమలపెంట/ మదనాపురం/ ఆత్మకూర్: ఎగువన కురిసిన వర్షాలతో మూడు రోజులుగా జూరాల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో మరింతగా తగ్గినట్లు అధికారులు తెలిపారు. శనివారం కేవలం 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో తెరిచి ఉంచిన క్రస్టు గేట్లను మూసి వేసినట్లు వివరించారు. అయితే నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 1,500 క్యూసెక్కులు, జల విద్యుదుత్పత్తి నిమిత్తం 26,817 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45 క్యూసెక్కులు, కుడి కాల్వకు 240 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 28,602 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.357 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులలో ఒకే గేటు..

సుంకేసుల డ్యాం నుంచి 4 వేల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. శనివారం ఎగువ నుంచి 4,504 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఒక గేటును ఎత్తి 4,345 క్యూసెక్కులు, మరో 159 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు విడుదల చేసినట్లు చెప్పారు.

శ్రీశైలానికి 31,162 క్యూసెక్కులు

జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 26,817, సుంకేసుల నుంచి 4,345 కలిపి మొత్తం 31,162 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. ప్రస్తుతం శ్రీశైలంలో 828.2 అడుగుల వద్ద 47.7648 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 416 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 0.484 మి.యూ., ఉత్పత్తి చేసి 1,095 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 0.291 మి.యూ., ఉత్పత్తి చేసి 638 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు వదిలారు.

రామన్‌పాడులో పెరుగుతున్న నీటిమట్టం

మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరగుతుంది. 1,021 అడుగులకు గాను శనివారం 1,017 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, కుడి కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. కాగా.. ప్రాజెక్టులోని కుడి, ఎడమ కాల్వల ద్వారా 12 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ చెప్పారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

జూరాలలోని దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఈ మేరకు శనివారం ఎగువలో 4 యూనిట్ల ద్వారా 156 మెగావాట్లు, దిగువలో 3 యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపట్టామని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. జూరాలకు పూర్తిస్థాయిలో వరద నీరు చేరిన తర్వాత 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపడుతామన్నారు.

బీచుపల్లి అంజన్న సన్నిధిలో దాసంగాలు


ఆంజనేయస్వామికి మట్టి కుండల్లో నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని అభయాంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తులు స్వామివారికి ప్రత్యేక దాసంగాలు సమర్పించారు. నెల రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మూడో వారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పుణ్యక్షేత్రం ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకుడు స్వామివారికి పంచామృత అభిషేకం, ఆకుపూజ, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామిని దర్శించుకొని, దాసంగాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

అధ్యాపకుడిపై చర్యలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఓ విద్యార్థి జవాబు పత్రాన్ని ఫొటో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన అధ్యాపకుడిపై అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. పీయూ పరిధిలో ఆన్‌లైన్ మూల్యాంకనం జరుగుతున్న క్రమంలో శుక్రవారం వనపర్తిలోని డబ్ల్యూసీఎం కళాశాల చెందిన ఓ అధ్యాపకుడు నిబంధనలను అతిక్రమించి జవాబుపత్రాన్ని ఫొటో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయగా వైరల్‌గా మారింది. దీంతో స్పందించిన అధికారులు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేయనునున్నారు. కమిటీ నివేదిక వచ్చిన తర్వాత సదరు అధ్యాపకుడిని బ్లాక్ లిస్టులో చేర్చనున్నారు. ప్రస్తుతం అతనికి వ్యాల్యువేషన్ విధుల నుంచి తప్పించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాల్యువేషన్ ప్రక్రియలో వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రవీణ పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


ఎస్వీఎస్ మెడికల్ కళాశాల ఆవరణలో ప్లకార్డులతో వైద్య విద్యార్థులు, యాజమాన్యం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని శనివారం అప్పన్నపల్లిలోని ఎస్వీఎస్ డెంటల్ కళాశాల విద్యార్థులు మెయిన్ రోడ్డుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్‌కు కారణమైన సిగరెట్, పాన్, గుట్కా, జర్దా, ఖైనీ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్లకార్డులను పట్టుకుని న్యూటౌన్ వరకు ప్రదర్శనగా వెళ్లారు. ఈ సందర్భంగా పొగాకు పదార్థాలతో కలిగే నష్టాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ రెసిడెంట్ డైరెక్టర్ కె.రాంరెడ్డి, వైద్య బృందం శ్రీప్రియ, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆధీనంలో వాహనం, ఫర్నీచర్


అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న బొలెరో వాహనం

మన్ననూర్: నల్లమల ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న టేకు కలప ఫర్నీచర్‌ను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారుల వివరాల ప్రకారం.. అమ్రాబాద్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన నరేష్ కొన్ని రోజుల క్రితం మన్ననూర్ గ్రామానికి చెందిన బొలేరో వాహనం అద్దెకు తీసుకొని నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో పాత ఇంటికి సంబంధించిన దూలాలతో తయారు చేసిన డైనింగ్ టేబుల్, కుర్చీలను హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో డిండి పోలీసులకు వాహనాన్ని పరిశీలించారు. వాహనంలో విలువైన టేకుతో తయారు చేసిన ఫర్నీచర్ కనిపించడంతో సంబంధిత అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వాహనాన్ని అదుపులోకి తీసుకుని మన్ననూర్ చెక్‌పోస్టు వద్దకు తరలించారు. నిజానిజాలపై విచారణ కోసం అమ్రాబాద్ ఎఫ్ఆర్ఓ, అటవీశాఖ సిబ్బందిని ఆదేశించినట్లు ఎఫ్ఆర్ఓ దేవజ తెలిపారు.

ప్రేమ వ్యవహారంపై రాజకీయ రగడ


ధ్వంసమైన ఇంటి తలుపులు

కోస్గి: మండలంలోని ఓ గ్రామంలో ప్రేమ వ్యవహారంలో రాజకీయ రగడ మొదలైంది. గ్రామానికి చెందిన ఓ బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు గత నెల 3న తీసుకెళ్లి రహస్యంగా వివాహం చేసుకున్నాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్నేహితుల ద్వారా సమాచారం తెలుసుకొని పారిపోయిన జంటను పట్టుకున్నారు. ఈ క్రమంలో బాలిక మైనర్ కావడంతో పెళ్లి చేసుకున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి ఈ నెల 30న రిమాండ్‌కు తరలించారు.

స్నేహితుడి కుటుంబానికి వేధింపులు..

తమ కుమార్తె పారిపోగానే బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో బాలిక ఇంటి పక్కనే ఉండే దాయాది కుటుంబం ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో పారిపోయిన యువకుడు దాయాది కుటుంబానికి చెందిన యువకుడికి స్నేహితుడని తెలియడంతో బాలిక కుటుంబ సభ్యులు అతడిపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు సదరు యువకుడిని అలాగే అతడి తల్లిని స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపారు. విచారణ అనంతరం గ్రామానికి వెళ్లిన యువకుడి కుటుంబంపై బాలిక కుటుంబ సభ్యులు దాడి చేశారు. పరారైన జంట దొరికినప్పటికీ గ్రామంలోని ఓ నాయకుడి ఆదేశాల మేరకు వలస వెళ్లిన యువకుడి కుటుంబానికి చెందిన ఇంటి తలుపులు పగలగొట్టారు. కరెంట్ మీటర్‌తోపాటు తాగునీటి నల్లాను ధ్వంసం చేశారు. తన దగ్గరకు వచ్చి రూ.20 వేలు ఇస్తేనే బాగుంటుందని, లేకపోతే అంతు చూస్తానని గ్రామానికి చెందిన ఓ నాయకుడు బెదిరించడంతో ఆ యువకుడు మరోమారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు మాత్రం గ్రామ నాయకుడి ఆదేశాల మేరకు కేసు నమోదు చేయకుండా ధ్వంసం చేసిన ఆస్తులకు మరమ్మతు చేయించాలని రాజీ ప్రయత్నాలు చేస్తున్నారని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తుంది.

ఊకచెట్టు వాగులో మొసలి సంచారం



మదనాపురం: శంకరమ్మపేట సమీపంలోని సరళాసాగర్ ఊకచెట్టు వాగు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఊట బావుల్లో శనివారం మొసలి కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. కొన్ని రోజులుగా ఇక్కడ మొసలి సంచరిస్తుందని రైతులు తెలిపారు. రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, అధికారులు స్పందించి మొసలిని బంధించాలని రైతులు కోరారు.